20062025-MAI-14_Layout 1 6/20/2025 1:54 AM Page 1



# గిల్‌కు మద్దతివ్వాలి: సచిన్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్‌కు మెరుగైన అవకాశాలున్నాయని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్‌తో కలిసి గురువారం ట్రోఫీని ఆవిష్కరించిన సచిన్ సిరీస్‌పై పలు కీలక విషయాలు పంచుకున్నాడు. 'భారత క్రికెట్ ప్రస్తుతం పరివర్తన దశలో ఉంది. తీసుకునే నిర్ణయాలపై దృష్టి పెడుతూ బయట జరుగుతున్న విషయాలను కొత్త కెప్టెన్ గిల్ మరిచిపోవాలి. భారత కెప్టెన్‌గా తీవ్ర ఒత్తిడి ఉంటుంది. వీటన్నంటిని తట్టుకుంటూ ముందుకు సాగాలి. ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు వ్యూహాలు రచించాలే తప్ప..డ్రెస్సింగ్ రూమ్ బయట జరుగుతున్న వాటని పట్టించుకోకూడదు. కెప్టెన్‌గా నిరూపించుకునేందుకు గిల్‌కు సమయం ఇవ్వడంతో పాటు అందరూ మద్దతు ఇవ్వాలి. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా కెప్టెన్ నిర్ణయాలు ఉండాలి. అంతేగానీ ఎవరు పడితే వారు చెప్పినట్లు వింటే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని అన్నాడు.

# ఫైనల్లో ఐదు టీమ్‌లు

- ఆసియాకప్ ఆర్చరీ టోర్నీ



సింగపూర్: ఆసియాకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో భారత యువ ఆర్చర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం ఐదు వేర్వేరు టీమ్ విభాగాల్లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. రెండో సీడ్ భారత పురుషుల రికర్వ్ టీమ్ ఏకపక్షంగా సాగిన సెమీస్‌లో 5-1తో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్లోకి ప్రవేశించింది. విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం..బంగ్లాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో వైష్ణవి పవార్, విష్ణు చౌదరి ద్వయం 5-3తో సింగపూర్‌కు చెందిన తబిత లిన్‌యో, యు లాంగ్ జోడీపై గెలిచింది. హోరాహోరీగా సాగిన పురుషుల కాంపౌండ్ టీమ్ సెమీస్‌లో భారత త్రయం కుశాల్ దలాల్, గణేశ్ తిరుమూరు, మిహిర్ అపార్ 30-29(షూటౌట్)లో ఆస్ట్రేలియాపై గెలిచి తుదిపోరులో నిలిచారు. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో షణ్ముకి , తేజాల్, తనిష్క 230-229తో కజకిస్థాన్‌ను ఓడించింది.

# నిస్సనక సెంచరీ

**శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 368/4**




గాలె(శ్రీలంక): బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంక దీటుగా రాణిస్తున్నది. సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ బంగ్లా బౌలింగ్‌ను సమర్థంగా నిలువరిస్తున్నది. ఓపెనర్ పతుమ్ నిస్సనక(187) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు. గత రెండు సెంచరీలను విదేశీ గడ్డపై కొట్టిన నిస్సనక తొలిసారి స్వదేశంలో సెంచరీ ఖాతా తెరిచాడు. మరో ఓపెనర్ లాహిరు ఉడానా(29) స్వల్ప స్కోరుకే పరిమితమైన నిస్సనక తన నిలకడ కొనసాగించాడు. డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఈ యువ బ్యాటర్ హసన్ మహమూద్ బౌలింగ్‌లో వెనుదిరిగి టెస్టుల్లో అత్యుత్తమ స్కోరు అందుకున్నాడు. మిడిలార్డర్‌లో సీనియర్ బ్యాటర్ చండిమల్ (54) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న మాథ్యూస్ (39) ఫర్వాలేదనిపించాడు. తైజుల్, నయిమ్, మోమినుల్ ఒక్కో వికెట్‌తీశారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 484/9 మూడో రోజు బ్యాటింగ్ కొనసాగించిన బంగ్లా 495 స్కోరుకు ఆలౌటైంది.

# శుభారంభం కోసం..

## నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు

**జోరు మీదున్న ఇరు జట్లు • కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై భారీ అంచనాలు**

**భారత క్రికెట్‌లో కొత్త శకం ఆరంభానికి వేళ యైంది. దిగ్గజాలు విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ, అశ్విన్ నిష్క్రమణ వేళ అంతగా అనుభవం లేని యువ జట్టుతో బరిలోకి దిగుతున్న భారత్..ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు సై అంటున్నది. లీడ్స్ వేదికగా నేటి నుంచే మొదలయ్యే తొలి టెస్టు ద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పోరుకు తెరలేవనుంది. రోహిత్ నుంచి పగ్గాలు అందుకున్న శుభ్‌మన్‌గిల్ సారథ్యంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగుతుంటే 'బజ్‌బాల్' లక్ష్యంగా స్టోక్స్‌సేన సవాల్ విసురుతున్నది. సొంతగడ్డపై సత్తాచాటేందుకు ఇంగ్లిష్ జట్టు ఉవ్విళ్లూరుతుంటే యువకులు, అనుభవజ్ఞుల మేళ వింపుతో టీమ్‌ఇండియా దీటైన పోటీనివ్వాలన్న పట్టుదలతో ఉంది. అండర్సన్-సచిన్ ట్రోఫీగా మారిన చారిత్రక పటౌడీ టోర్నీలో శుభారంభం ఎవరిదో త్వరలో తేలనుంది.**



మ: 3.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

లీడ్స్: భారత క్రికెట్‌లో నవశకానికి నాంది పడింది. పరివర్తనలో భాగంగా దిగ్గజాల వారసత్వానికి కొనసాగింపుగా కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న శుభ్‌మన్‌గిల్..టీమ్‌ఇండియాను ముందుకు నడిపించనున్నాడు. 25 ఏండ్ల వయసులో టెస్టు కెప్టెన్సీ అందుకున్న గిల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చివరిసారి 2007లో ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్ గెలిచిన భారత్ 18 ఏండ్లుగా సిరీస్ విజయం కోసం చకోరా పక్షిలా ఎదురుచూస్తున్నది. తొలిసారి అజిత్ వాడేకర్ సారథ్యంలో 1971లో సిరీస్ గెలిచిన భారత్‌కు 1986లో కపిల్‌దేవ్ రెండోసారి విజయాన్ని అందించాడు. ఆ తర్వాత మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ కెప్టెన్‌గా 2007లో ఇంగ్లండ్‌లో ఇండియా టెస్టు సిరీస్ ముద్దాడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంగ్లండ్‌లో టీమ్‌ఇండియాకు చేదు అనుభవాలే ఎదురయ్యాయి. పచ్చికతో కళకళలాడే ఇంగ్లండ్ పిచ్‌లపై డ్యూక్ బంతి చేసే విన్యాసాలకు మన బ్యాటర్లు తేలిపోవడంతో సిరీస్‌లు చేజారాయి. అయితే గత అనుభవాలను తిరగరాస్తూ గిల్-గంభీర్ కాంబినేషన్‌లో కొత్త చరిత్ర శ్రీకారం చుట్టేందుకు టీమ్‌ఇండియా తహతహలాడుతున్నది. ఓవైపు అనుభవలేమి కనిపిస్తున్నా..మెండైన ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న యువ క్రికెటర్లు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు బజ్‌బాల్‌తో టెస్టు క్రికెట్‌కు కొత్త రూపాన్ని తీసుకొచ్చిన స్టోక్స్-మెక్‌కల్లమ్ జోడీ..భారత్‌ను నిలువరించేందుకు పక్కా వ్యూహంతో బరిలోకి దిగుతున్నది. గత రెండు దశాబ్దాలు ఇంగ్లండ్ పేస్ బౌలింగ్‌ను తమ భుజస్కంధాలపై మోసిన అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నది. వీరి గైర్హాజరీలో ఇంగ్లండ్ పేస్ దళం అనుభవలేమితో కనిపిస్తున్నది.

### గిల్‌పైనే భారం:

రోహిత్ వారసునిగా కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న గిల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. 25 ఏండ్ల వయసులోనే టెస్టు కెప్టెన్ అయిన గిల్‌కు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. కోహ్లీ నిష్క్రమణతో ఖాళీ అయిన కీలకమైన నాలుగో స్థానాన్ని భర్తీ చేయడంతో పాటు సెషన్ సెషన్‌కు మారే టెస్టులో ఎప్పటికప్పుడు కొనసాగుతూనే ఉన్నది. ఇంగ్లండ్ ఇప్పటికే తమ ఫైనల్ లెవన్‌ను ప్రకటించగా, టీమ్‌ఇండియా మళ్లగుల్లాలు పడుతున్నది. ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ ఖరారు కాగా, మూడో స్థానంలో సాయి సుదర్శన్, కరణ్ నాయర్‌పై సందిగ్ధత కొనసాగుతున్నది. నాలుగులో గిల్, ఐదులో పంత్ బ్యాటింగ్‌కు రానున్నారు. పిచ్‌ను బట్టి పేస్ ఆల్‌రౌండర్లు శార్దూల్ ఠాకూర్, నితీశ్‌కుమార్‌రెడ్డి ఇద్దరిని ఆడించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ కనిపిస్తున్నది. బుమ్రా, సిరాజ్ పేస్‌బౌలింగ్‌కు సారథ్యం వహించనుండగా, మూడో పేసర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్‌సింగ్‌లో ఎవరికి బెర్తు దక్కుతుందో చూడాలి. ఏకైక స్పిన్నర్‌గా జడేజా తుది జట్టులో ఉండే చాన్స్ ఉంది.

వ్యూహాలు రచించాల్సిన అవసరం ఏర్పడనుంది. పేస్‌కు స్వర్గధామమైన ఇంగ్లండ్ పిచ్‌లపై బ్యాటింగ్ ఒక రకంగా కత్తిమీద సాము లాంటిదే. ఊరించే బంతులను వేటాడుతూ షాట్లు ఆడితే మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఇదిలా ఉంటే తొలి టెస్టుకు తుది కూర్పుపై ఆసక్తి

### అనుభవలేమితో:

ఇంగ్లండ్ బౌలింగ్ బృందం అనుభవలేమితో కనపడుతున్నది. అండర్సన్, బ్రాడ్ రిటైర్మెంట్ తర్వాత వారి స్థానాలను భర్తీ చేసే బౌలర్లు ఇంగ్లండ్‌కు ఇంకా దొరుకలేదు. బ్రైడన్ కార్స్, జోష్ టాంగ్‌కు అంతగా అనుభవం లేకపోగా, క్రిస్ వోక్స్ పెద్ద దిక్కుగా వ్యవహరించనున్నాడు. కెప్టెన్ స్టోక్స్ ఆల్‌రౌండర్ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. ఏకైక స్పిన్నర్‌గా బషీర్ కొనసాగనున్నాడు. బ్యాటింగ్ విషయానికొస్తే జాక్ క్రాలీ, డకెట్, రూట్, బ్రూక్, పోప్, స్టోక్స్‌తో బలంగా కనిపిస్తున్నది. భారత్ అంటే రెచ్చిపోయే రూట్ ఇంగ్లండ్‌కు కీలకం కాబోతున్నాడు.

### జట్ల అంచనా

**భారత్:** జైస్వాల్, రాహుల్, సుదర్శన్, గిల్(కెప్టెన్), పంత్, కరణ్‌నాయర్, జడేజా, శార్దూల్/నితీశ్/కుల్దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, బుమ్రా, సిరాజ్.
**ఇంగ్లండ్:** క్రాలె, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్(కెప్టెన్), స్మిత్, వోక్స్, కార్స్, టాంగ్, బషీర్

### పిచ్, వాతావరణం

పచ్చికతో కనిపిస్తున్న హెడింగ్లే పిచ్..పేస్‌కు బాగా సహకరించనుంది. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్‌కు మొగ్గుచూపే అవకాశముంది. ఇంగ్లండ్‌లో ప్రస్తుతం వేసవి కొనసాగుతున్న నేపథ్యంలో రోజులు మారిన కొద్ది పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నది. గత ఆరు సార్లు తొలుత బౌలింగ్ చేసిన జట్లే విజయాలు సాధించాయి.

**1** 2018 నుంచి ఇంగ్లండ్‌లో అత్యధిక పరుగులు(597) చేసిన పర్యాటక బ్యాటర్‌గా రాహుల్ టాప్‌లో ఉన్నాడు.

**2** హెడింగ్లేలో భారత్ ఏడు టెస్టు మ్యాచ్‌లాడితే రెండింటిలో గెలిచి నాలుగింటిలో ఓటమిపాలైంది.

**5** పిన్న వయసులో భారత టెస్టు కెప్టెన్‌గా ఎంపికైన ఐదో క్రికెటర్‌గా గిల్(25 ఏండ్లు) నిలిచాడు.

**9** టెస్టుల్లో ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోరూట్‌ను బుమ్రా తొమ్మిది సార్లు ఔట్ చేశాడు. కమిన్స్(11), హాజిల్‌వుడ్(10) ముందు వరుసలో ఉన్నారు.

**136** భారత్, ఇంగ్లండ్ మధ్య ఇప్పటి వరకు 136 మ్యాచ్‌లు జరిగితే ఇంగ్లండ్ 51, భారత్ 35 మ్యాచ్‌ల్లో గెలిచాయి. 50 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.




# పోటీలో 640 మంది బాక్సర్లు

- నేటి నుంచి జాతీయ జూనియర్ బాక్సింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: రోహ్‌తక్ వేదికగా శుక్రవారం నుంచి 6వ జాతీయ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ మొదలుకానుంది. దేశంలోని వివిధ రాష్ర్టాల నుంచి 640 మందికి పైగా బాక్సర్లు టోర్నీలో పోటీపడే అవకాశముంది. మొత్తం 13 విభాగాల్లో బాలురు, బాలికలు బరిలోకి దిగనున్నారు. బాలుర కేటగిరీలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు, బాలికల విభాగంలో హర్యానా డిఫెండింగ్ చాంపియన్లుగా తమ టైటిళ్లను నిలబెట్టుకునేందుకు పట్టుదలతో ఉన్నాయి. జాతీయ టోర్నీ ద్వారా ప్రతిభ కల్గిన బాక్సర్లు వెలుగులోకి వచ్చే అవకాశముందని బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అజయ్‌సింగ్ పేర్కొన్నాడు.

## బ్రిస్బేన్ టీమ్‌లో జెమీమా

మెల్‌బోర్న్: మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో భారత యువ క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్‌ను బ్రిస్బేన్ హీట్ జట్టు తిరిగి తీసుకుంది. గురువారం జరిగిన వుమెన్ బిగ్‌బాష్ లీగ్(డబ్ల్యూబీబీఎల్)వేలం పాట జరిగింది. ఇందులో మొత్తం 23 మంది అంతర్జాతీయ క్రికెటర్లను వివిధ ఫ్రాంచైజీలు సొంత చేసుకున్నాయి. మిడిలార్డర్‌లో కీలకమైన రోడ్రిగ్స్‌ను బ్రిస్బేన్ టీమ్ అట్టిపెట్టుకుందని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. రోడ్రిగ్స్‌తో పాటు చినెల్లీ హెన్రీ, నాడైన్ డీ క్లెర్క్‌ను బ్రిస్బేన్ టీమ్ సొంతం చేసుకుంది. 15 మంది భారత మహిళా క్రికెటర్లు ఈ వేలంలో పాల్గొన్నారు.

## బెంగళూరులో బిల్లీజీన్ కప్

బెంగళూరు: ప్రతిష్ఠాత్మక బిల్లీజీన్ కింగ్ కప్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. నవంబర్ 14 నుంచి మొదలుకానున్న ప్లేఆఫ్స్‌లో మొత్తం 21 దేశాలు ఏడు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. గ్రూపు-జీలో ఆతిథ్య భారత్‌తో పాటు స్లోవేనియా, నెదర్లాండ్స్ ముఖాముఖి ఆడనున్నాయి. ఇటీవల జరిగిన ఆసియా/ఓషియాన గ్రూపు-1 టైలో అదరగొట్టిన భారత్ టోర్నీ సుదీర్ఘ చరిత్రలో రెండోసారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.